క్లుప్తంగా

నేడు అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల ఆవరణ వద్ద శుక్రవారం నుంచి శనివారం వరకు 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం పల్లా వీర ప్రభాకరరావు గురువారం తెలిపారు. అండర్–17 విభాగంలో బాలికలకు పోటీలు ఇక్కడ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు చెప్పారు.

'రుడా'కు మాస్టర్ ప్లాన్ అవసరం

రాజానగరం: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధి 3200 చదరపు కిలోమీటర్లు ఉన్నా గానీ, ఆ మేరకు మాస్టర్ ప్లాన్ లేదని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. సత్వరమే దాన్ని తయారు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అభిమాని మొక్కుబడి మేరకు దివాన్ చెరువులోని లక్ష్మీగణపతి, కనకదుర్గ ఆలయాలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను పొందాలంటే మాస్టర్ ప్లాన్ ఎంతో అవసరమన్నారు.

కార్తిక వన సమారాధన

సీతానగరం: కార్తిక మాసం సందర్భంగా చినకొండేపూడిలోని వైఎస్సార్ భవనం వద్ద గురువారం వన సమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు, కృష్ణవేణి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వనసమారాధనలో పాల్గొన్నారు.

వంగలపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద కార్తిక వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. సుమారు రెండువేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా సాయి అఖండ జపయజ్ఞం



బాబా పంచలోహ విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకులు, భక్తులు

మధురపూడి: కోరుకొండ అంకాలమ్మ గుడి వీధిలోని సాయిబాబా ఆలయంలో గురువారం 12 గంటల పాటు సాయి అఖండ జపయజ్ఞం జరిగింది. తొలుత బాబా పంచలోహ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. కార్తిక మాసం కావడంతో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ నాయకులు రామకృష్ణ, బిజిలానీ, రాము, రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామ దీపార్చన



సంపర వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపార్చన చేస్తున్న భక్తులు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం గురువారం సందర్భంగా గోవిందనామ దీపార్చన ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులంతా గోవింద నామాలు పఠించి నామం ఆకారంలో ఉన్న దీపాలు వెలిగించారు. స్వామి వారిని భక్తిప్రపత్తులతో పూజించారు. కార్తికమాసం అంతా గోవింద నామ దీపార్చనలు నిర్వహించనున్నామని ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు తెలిపారు.

ఇన్‌చార్జి ఏవోగా తులసి

సీతానగరం: మండల ఇన్‌చార్జి వ్యవసాయ శాఖాధికారిగా డి.రామతులసి నియమితులయ్యారు. ఆమె కోరుకొండలోని ఇంటిగ్రేటెడ్ ల్యాబరేటరీలో అగ్రికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. త్వరలోనే ఆమె బాధ్యతలు స్వీకరిస్తారని ఏడీఏ మల్లికార్జునరావు తెలిపారు.

రూ.300 కోసం ఘర్షణ

సీతానగరం: మూడు వందల రూపాయల కోసం జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గళ్లకు చెందిన యాళ్ల విజయ్ కుమార్, మానుకొండ శేఖర్‌ల మధ్య ఈ నెల 25వ తేదీ సాయంత్రం రూ.300 కోసం ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో శేఖర్ ఇటుకతో దాడి చేయడంతో విజయ్ కుమార్ తలకు తీవ్రగాయమైంది. దీంతో విజయ్ కుమార్ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాతపై చిన్నచూపేల?

- ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
- ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచితంగా అమలు



బిక్కవోలులో వరి పైరును ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

బిక్కవోలు: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలి. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. రైతులకు అండగా ఉండడం మాట అటుంచితే, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వారి నడ్డి విరుస్తోంది. కూటమి ప్రభుత్వం నిర్ణయాలు రైతులపై పగసాధింపు చర్యల్లా ఉన్నాయని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాలు, తుఫాన్‌లతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులను ఆదుకునేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ– క్రాప్‌లో నమోదు చేసి, సాగు విస్తీర్ణం అంతటికీ బీమా వర్తించేలా ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించేంది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడేది కాదు. బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండేది కాదు. పంటలకు నష్టం వాటిల్లితే ఠంఛన్‌గా పరిహారం అందేది.

రైతులే ప్రీమియం చెల్లించాలి



పంటలకు బీమా వర్తించాలంటే రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. బీమా చేయించుకున్న రైతులకు సంబంధించిన పంటలు ప్రకృతి విపత్తులకు దెబ్బతింటే పరిహారం అందుతుంది. నిర్దేశిత గడువు లోగా రైతులు ప్రీమియం చెల్లించాలి.

– సామ్యూల్ జాన్, వ్యవసాయ అధికారి, బిక్కవోలు

రైతన్నల ఆవేదన

చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంట బీమాను రద్దు చేయడంతో ప్రీమియం భారం రైతులపై పడుతోంది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా కోసం రైతులే ప్రీమియం సొమ్ము చెల్లించాలంటూ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. రబీ సీజన్‌లో సుమారు 70 వేల ఎకరాల్లో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో వరి, వేరుశెనగ, అపరాలు, జీడి మామిడి వంటివి సాగు చేస్తారని అధికారులు చెబుతున్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపులు రైతులే చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వమే రైతుల తరఫున సంబంధిత బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రైతు భరసా పథకం కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇంకా అందించలేదని అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నామని ఇప్పుడు బీమా పథకాన్ని కూడా నీరుగార్చితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

ప్రీమియం చెల్లింపులు ఇలా

2024–25 రబీ సీజన్‌కు ప్రభుత్వం గుర్తించిన పంటకు బీమా ప్రీమియం చెల్లింపుల వివరాలను ఇటీవల వెల్లడించింది. వరికి ఎకరానికి రూ. 630, మొక్కజొన్నకు రూ. 540, మినప పంటకు రూ.265, వేరు శెనగకు ఎకానికి రూ.460, జీడి మామిడికి రూ.1500 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరి పంటకు డిసెంబర్ 31లోగా మీ సేవా కేంద్రాలు గానీ, కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామ సచివాలయాల్లో గానీ రైతులు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమాను రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం చర్యలు రైతులను దెబ్బ తీసేలా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా పథకం పేరుతో పెట్టుబడి సాయం చెప్పిన సమయానికి అందించేవారు. ఉచిత పంటల బీమా పథకం పేరిట పంటలకు ప్రభుత్వం బీమా చేయించేది. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించలేదు. ఇప్పుడు బీమా భారం వేస్తోంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– తాళ్ల నిరంజన్ రెడ్డి, రైతు, బిక్కవోలు.

సమంజసం కాదు



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా చెల్లించాలని అనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేయాలి.

– పోతుల ప్రసాద్‌రెడ్డి, రైతు, ఊలపల్లి.

నేడు లక్ష బిల్వార్చన



భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సత్రాజు తెలిపారు. అనంతరం అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులందరూ తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని, అన్న ప్రసాదం స్వీకరించాలని కోరారు. ఆలయంలో ఈ నెల 2వ తేదీ నుంచి అర్చకుడు మానేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఓం నమశ్శివాయ అఖండనామ జపయజ్ఞం జరుగుతోందన్నారు.

గాడాలలో నేడు 1,08,012 రుద్రాక్షల మహార్చన

కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 1,08,012 రుద్రాక్షల మహార్చన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠాధిపతి చిన్న వెంకన్న బాబు తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా రుద్రాక్షల మహార్చన నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదానంలో భాగంగా గురువారం భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. దాత నాగుబండి రామ కౌశిక్ జనార్దన్ ఆర్థిక సహకారంతో 150 మందికి అందజేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ ప్రశాంతి
- దోసకాయలపల్లి పీహెచ్‌సీ తనిఖీ



దోసకాయలపల్లి పీహెచ్‌సీలో రోగులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మధురపూడి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేయడానికి పీహెచ్‌సీలోని వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రోగులతో కొద్దిసేపు మాట్లాడి, సేవలందుతున్న తీరుపై ఆరా తీశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలు, సేవలందుకున్న మహిళలు, గర్భిణులు, బాలింతల వివరాలను పరిశీలించారు. ఇక్కడ పనిచేస్తున్న కొందరు ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు రోగులను ప్రైవేటు హాస్పటల్స్‌లో చికిత్స కోసం సిఫారసు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. పీహెచ్‌సీకి వచ్చిన వారందరికీ మంచి వైద్యం అందించాలన్నారు. హాస్పిటల్లో అందిస్తున్న సేవలను పీహెచ్‌సీ డాక్టర్ వి.కోటేశ్వరరావు వివరించారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు గడువు పెంపు

సీతానగరం: పట్టభద్రుల ఓటు నమోదుకు డిసెంబర్ 9వ తేదీ వరకూ గడువు ఉందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 నవంబర్ ఒకటికి పట్టభద్రులుగా మూడేళ్లు పూర్తయినవారు అర్హులన్నారు. మొదటి విడత దరఖాస్తు చేసుకున్న వారి జాబితా మండల పరిషత్ కార్యాలయంలో సిద్ధంగా ఉందని, ఓటర్లు వచ్చి పరిశీలించుకోవచ్చన్నారు.


పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

రాజానగరం: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రాథమిక విద్యాలయాలే ప్రథమ సోపానాలని ప్రాంతీయ పాఠశాల విద్యాసంచాలకులు నాగమణి అన్నారు. ఆ విషయంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. మల్లంపూడిలోని సాయి మాధవి ఇంజినీరింగ్ కాలేజీ భవనంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు వారం రోజుల పాటు జరిగే స్కూల్ లీడర్షిప్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్‌ను గురువారం ఆమె సందర్శించారు. పాఠశాలల నిర్వహణ, నాయకత్వ లక్షణాలపై పలు సూచనలు చేశారు. పాఠశాలలను సమర్థంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన బోధనను అందించడం, బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించడం, స్వీయ రక్షణను వివరించడం చాలా అవసరమన్నారు. ఉపాధ్యాయుల పనితీరును ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆన్‌లైన్ డేటాపై ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడేలా, బడి బయట పిల్లలు ఎవ్వరూ లేకుండా ఉండేలా, నూరుశాతం జీఈఆర్‌ని సాధించేలా ప్రతి ప్రధానోపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మానటరింగ్ అధికారి గౌరీ శంకరరావు, కోనసీమ జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, రాజానగరం ఎంఈఓ 2 జ్యోతి ప్రసాద్, మాస్టర్ ఫెసిలిటేటర్లు, 190 మంది హెచ్ఎంలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐడీఈ బూట్ క్యాంప్

రాజానగరం: గోదావరి గ్లోబెల్ యూనివర్సిటీ (జీజీయూ)లో శుక్ర, శనివారాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) బూట్ క్యాంప్ జరగనుంది. ఈ కార్యక్రమ నిర్వహణకు రాష్ట్రంలో జీజీయూని మోడల్ సెంటర్‌గా గుర్తించారని వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధ్యాయులకు ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంబంధిత అంశాలలో మౌళిక శిక్షణ, అవగాహన కలిగించే విధంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి దాదాపు 200 మంది ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అసోసియేట్ ప్రొఫెసర్లు డి.విజయేంద్ర కుమార్, కె.వినోద్ వర్మలను నోడల్ అధికారులుగా నియమించారు.

కార్తిక దీపోత్సవం



ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో గురువారం రాత్రి కార్తిక దీపోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన నీలపాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓంకారం, స్వస్తిక్, త్రిశూలం, శంకు, చక్రాలు, శివలింగం, కలువలు తదితర ఆకారాల్లో దీపాలను వెలిగించారు.

ఫూలే జీవితం భావితరాలకు ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమని నమ్మిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ పేద కార్మికులు, మహిళలతో సహా ప్రజలందరి సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. అగ్రకుల పెత్తనం లేని కొత్త సమాజాన్ని సృష్టించాలని పిలుపునిచ్చిన ఉద్యమానికి ఆయన నాయకత్వం వహించారన్నారు. మహిళలకు విద్యతో పాటు పలు హక్కుల కోసం పోరాడారన్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, బందారు శ్రీనివాస్, పార్టీ నాయకులు సత్తి వెంకటరెడ్డి, కానూరి కృష్ణ, తేతలి బుల్లిరెడ్డి, పడాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే ఆదర్శనీయుడు



కొంకుదురులో జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బిక్కవోలు: సమాన హక్కులు, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహాత్మా జ్యోతిబా పూలే గొప్ప దార్శనికుడని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల ఆవరణలో పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతిబా పూలే సామాజిక తత్వవేత్త, ఉద్యమ కారుడు, సంఘ సేవకుడిగా సేవలందించారని గుర్తు చేశారు. మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. నేటి విద్యార్థులు ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వర్‌రెడ్డి, శ్రీ కృష్ణసాయి, లక్ష్మణరెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు పూలే



రంగంపేటలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

రంగంపేట: దేశంలో అక్షర జ్యోతిని వెలిగించిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని మండల బీసీ నాయకుడు గుత్తుల సుబ్రహ్మణ్యం అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రం రంగంపేట గ్రామంలోని సంత మార్కెట్ వద్ద పలువురు బీసీ నాయకులు ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడిన దీనజన బాంధవుడు జ్యోతీరావు పూలే అని అన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితో ప్రభుత్వాలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల బీసీ నాయకులు అంచూరి సహదేవుడు, కేతా సత్తిబాబు, భీమార్జున్, చంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా నందీశ్వర అభిషేకం



అభిషేకం అనంతరం అలంకరణలో నందీశ్వరుడు

రంగంపేట: రంగంపేట గ్రామంలో స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి గురువారం సాయంత్రం అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎం.నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ అభిషేకంలో ఉపవాసం ఉండి భక్తులు పాల్గొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై అభిషేకాన్ని తిలకించారు. ఉమా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చలి తీవ్రతతో అనేక సమస్యలు

రాజమహేంద్రవరం రూరల్: చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దగ్గు తదితర శ్వాసకోశ సమస్యలు పెరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా వైద్యుల సూచనలు పాటించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) సిబ్బంది, వైద్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దగ్గు, చలి, శ్వాసకోశ సంబంధ వ్యాధుల లక్షణాలున్న వారిని ప్రారంభ దశలోనే గుర్తించేలా అవగాహన కల్పించామన్నారు. ప్రజలకు సత్వర చికిత్స అందజేయడంలో పాటు మెరుగైన వైద్య సేవలను సమయానికి అందించేందుకు అవసరమైన మందులు, వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. చలి తగ్గించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోగ లక్షణాలు కనిపించినప్పుడు సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.


క్రీడా కిట్లు అందజేత



కిట్లు అందుకున్న క్రీడాకారులతో పాఠశాల ఉపాధ్యాయులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అండర్–17 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు కిట్లను పాఠశాల వద్ద నిర్వాహకులు అందించారు. క్రీడాకారులకు పాఠశాల హెచ్ఎం పల్లా వీర ప్రభాకరరావు వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తమ క్రీడాకారులు ఇతర ప్రాంతాలకు వెళ్లి క్రీడలను ఆడేవారన్నారు. అయితే ఇప్పుడు క్రీడలు మన ప్రాంతంలో జరిగడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జంగా శ్రీనివాస్ ప్రసాద్, పీడీ ఘానకొండ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి నేడు ప్రత్యేక పూజలు



చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభిషేకాలకు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు హాజరవుతారన్నారు.